క్లుప్తంగా

నేటి నుంచి అంగన్‌వాడీలకు శిక్షణ

ఓజిలి/సైదాపురం: ఓజిలి మండల పరిషత్, సైదాపురం జిల్లా పరిషత్ పాఠశాలల్లో మంగళవారం నుంచి అంగన్‌వాడీ కార్యకర్తలకు జ్ఞాన జ్యోతి సర్టిఫికెట్ కోర్సులో శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్టు ఎంఈవోలు శైలజ, దయాకర్ రావు, సుప్రియ తెలిపారు. రెండు విడతల్లో శిక్షణ ఉంటుందని, మొదటి విడత 18 నుంచి 20 వరకు, రెండో విడత 22 నుంచి 24 వరకు ఉంటాయన్నారు. ఈ శిక్షణా తరగతులను కార్యకర్తలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

రేపు ఇంటర్వ్యూలు

సైదాపురం: మండలంలోని నాలుగు బ్యాంకుల పరిధిలో రుణాల మంజూరుకు సంబంధించి ఇంటర్వ్యూలను బుధవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో నిర్వహించనున్నట్టు ఎంపీడీవో పురుషోత్తం శివకుమార్ తెలిపారు. బీసీలకు 30 యూనిట్లు, కాపులకు 4, రెడ్లకు 3, కమ్మలకు 2, ఆర్యవైశ్యులకు 1, బ్రాహ్మణులకు 1, ఈబీసీలకు రెండు యూనిట్లు మంజూరైనట్టు తెలిపారు. దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులు ఒరిజినల్ డాక్యుమెంట్లతో ఇంటర్వ్యూలకు హాజరుకావాలని సూచించారు.

24 వరకు ఇంటింటా సర్వే


సర్వే చేస్తున్న న్యాయవాది, అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు

సైదాపురం: హైకోర్టు ఉత్తర్వుల మేరకు ఈ నెల 24వ తేదీ వరకు ఇంటింటా సర్వే చేపట్టనున్నట్టు ప్యానల్ న్యాయవాది పి.రమేష్ తెలిపారు. ఆయన సోమవారం ఏఎన్‌ఎంలు, అంగన్‌వాడీ కార్యకర్తలతో కలిసి సైదాపురంలోని మన్నారపు సిద్ధయ్య గిరిజన కాలనీలో ఇంటింటికీ వెళ్లి సర్వే చేశారు. ఆయన మాట్లాడుతూ సర్వేలో పిల్లలు, దివ్యాంగులతోపాటు అనారోగ్యంతో బాధపడుతున్న వారు, బాల్య వివాహాలు చేసుకున్న వారి వివరాలను సేకరించి జిల్లా అధికార సంస్థకు పంపుతామన్నారు. గూడూరు ఏడో అదనపు జిల్లా సెషన్స్ కోర్టు జడ్జి పర్వీన్ సుల్తాన్ బేగం సూచనలతో సర్వే చేస్తున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో ఏఎన్‌ఎం శ్రీలత, ఆశా వర్కర్ అరుణమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త సేజాత పాల్గొన్నారు.

ఆలయాల పునఃనిర్మాణానికి చర్యలు


పోలేరమ్మ ఆలయం వద్ద కొలతలు తీస్తున్న దేవదాయ శాఖ స్తపతి, ఈవో

నాయుడుపేట టౌన్: నాయుడుపేటలోని పలు ఆలయాల పునఃనిర్మాణానికి జిల్లా స్తపతి దుర్గాప్రసాద్ సోమవారం పరిశీలించారు. ఆలయాలు శిథిలావస్థ కు చేరుకున్నాయని, వాటిని బాగు చేయాలని స్థానిక దేవదాయ శాఖ ఈవో రవికృష్ణ జిల్లా సూపరింటెండెంట్‌కు విన్నవించారు. ఈ క్రమంలో జిల్లా స్తపతి సోమవారం పిళ్లారిగుడి, విన్నమాల శివాలయం, నాయుడుపేటలోని పోలేరమ్మ ఆలయాలను పరిశీలించారు. కొలతలు తీసుకున్నారు. అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి పంపిస్తామని తెలిపారు. ఈవో రవికృష్ణ, యుగంధర్, బాలాజీ పాల్గొన్నారు.

నాయుడుపేటలో చోరీ



నాయుడుపేట టౌన్: పట్టణంలోని కుమ్మరి వీధిలోని ఇంటిలో దొంగలు పడి 9 సవర్ల బంగారు నగలు, రూ.55 వేల నగదును చోరీ చేశారు. బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పురుషోత్తం కుటుంబ సభ్యులతో కలిసి రెండు రోజుల కిందట తమిళనాడులోని తిరువణ్ణామలై వెళ్లాడు. దుండగులు ఆదివారం అర్ధరాత్రి తాళాలు పగులగొట్టి లోనికి ప్రవేశించారు. బీరువాలో ఉన్న బంగారు నగలు, నగదును అపహరించుకెళ్లారు. పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించారు.

గ్రామాల్లో బెల్ట్ దందా

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రతి గ్రామంలోనూ మద్యం ఏరులై పారుతోంది. కొంతమంది టీడీపీ నేతల అండతో గ్రామాల్లో యథేచ్ఛగా బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు. రాత్రి, పగలు తేడా లేకుండా మద్యం విక్రయాలు సాగిస్తున్నారు. క్వార్టర్‌పై ఎమ్మార్పీకి అదనంగా రూ.30 వసూలు చేస్తున్నారు. ఈ విషయం తెలిసినా అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.


కలిచేడులో మద్యం షాపును మూయిస్తున్న తహసీల్దార్ (ఇన్‌సెట్‌లో) బోరు వద్ద మద్యం సేవిస్తున్న వృద్ధుడు



- టీడీపీ నేతల అండతో రెచ్చిపోతున్న అక్రమార్కులు
- రాత్రి పగలు తేడా లేకుండా విక్రయాలు
- బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తున్నా పట్టించుకోని అధికారులు


పర్మిట్ రూములో మద్యం సేవిస్తున్న మందుబాబులు

సాక్షి టాస్క్‌ఫోర్స్: గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ప్రభుత్వమే మద్యం షాపులను నిర్వహించేది. గ్రామాల్లో ఎక్కడా బెల్టు షాపులు ఎక్కడా కనిపించేవి కావు. షాపుల్లో ఒక వ్యక్తికి మూడు క్వార్టర్ బాటిళ్లు మాత్రమే విక్రయించేవారు. పరిమితికి మించి ఎవరైన మద్యాన్ని తరలిస్తే అధికారులు దాడులు చేసి కేసులు నమోదు చేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రైవేట్ మద్యం పాలసీని తీసుకువచ్చింది. ఇందులో భాగంగా వెంకటగిరి నియోజకవర్గానికి 25 మద్యం షాపులు మంజూరు చేసింది. వెంకటగిరి పట్టణం, మండలంలో 9 దుకాణాలు, బాలాయపల్లి మండలంలో 3, డక్కిలిలో 3, సైదాపురంలో 4, రాపూరులో 4, కలువాయిలో 2 మద్యం దుకాణాలు ఏర్పాటయ్యాయి. మద్యం షాపులు దక్కించుకున్న వారు లాభాల కోసం అడ్డగోలుగా అమ్మకాలు సాగిస్తున్నారు. వారికి కూటమి నేతలు అండగా ఉండడంతో ఒక్కో మద్యం దుకాణానికి అనుబంధంగా గ్రామాల్లో రెండు, మూడు బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు. నియోజకవర్గంలో 140 పంచాయతీలు ఉండగా 220కి పైగా గ్రామాలు ఉన్నాయి. ఒక్కో గ్రామంలో రెండు చొప్పున 440కి పైగా బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు. మేజర్ పంచాయతీల్లోని ఒక్కో గ్రామంలో ఐదు వరకు బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు. వీటి ద్వారా రోజుకు రూ.లక్షకు పైగా విక్రయాలు జరుగుతున్నట్టు సమాచారం.

అనుమతి లేకున్నా పర్మిట్ రూములు

మద్యం దుకాణాలు ఏర్పాటు చేసిన ప్రతి చోటా అనుమతులు లేకపోయినా పర్మిట్ రూములు నిర్వహిస్తున్నారు. ఈ విషయం తెలిసినా ఎక్సైజ్, పోలీసు అధికారులు పట్టించుకోవడం లేదు. మరి కొన్ని చోట్ల దుకాణం పక్కనున్న ఖాళీ ప్రదేశాలను మినీబార్లుగా మార్చి మద్యం తాగిస్తున్నారు. బెల్టు షాపుల నియంత్రణకు చర్యలు చేపట్టాలని మహిళా సంఘాలు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నా ప్రభుత్వం ఏ మాత్రం పట్టించుకోవడంలేదు.

బెల్టుషాపుల వారికి టీడీపీ అండ



కూటమి ప్రభుత్వంలో బెల్టుషాపులు ఎక్కువయ్యాయి. కూలి పనులు చేస్తే రోజుకు రూ.300లు వస్తాయి. మగవారు ఆ డబ్బును లాక్కొని మద్యం తాగి పడిపోతున్నారు. ఇలా అయితే కుటుంబ పోషణ ఎలా సాగుతుంది. బెల్టుషాపుల వారికి టీడీపీ నాయకుల అండ ఉండడంతోఎక్సైజ్, పోలీసు అధికారులు పట్టించుకోవడంలేదు.

– తిరకాల విజయ, టుటుకూరు

కుటుంబాలు నాశనం అవుతున్నాయి.



మద్యం మహమ్మారి వల్ల పచ్చని కుటుంబాలు నాశనం అవుతున్నాయి. గ్రామాల్లో సైతం రాత్రి, పగలూ తేడా లేకుండా మద్యం దొరుకుతుండడంతో మందు బాబులు పూటుగా మద్యం తాగుతున్నారు. కుటుంబాలు రోడ్డు పడుతున్నాయి. తాగుడుకు బానిసలైన వారి భార్య, పిల్లలు దుర్భర జీవితం గడుపుతున్నారు.

– గుంటమడుగు గీతాంజలి, రాజుల ఎరుగుంటపాళెం

ఫిర్యాదు చేసినా చర్యలు లేవు



గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోంది. అధికార పార్టీ నేతలే బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు. ఉబ్బాల గ్రామంలో బెల్టుషాపులను అరికట్టాలని జిల్లా కలెక్టర్‌కు వినతి పత్రం సమర్పించినా అధికారులు పట్టించుకోలేదు. ప్రభుత్వ కార్యాలయాల సమీపంలోనూ మద్యం విక్రయిస్తున్నారు. మహిళలు, పిల్లలు అటుగా వెళ్లాంటే ఇబ్బంది పడుతున్నారు.

–గోగినేని శివకుమార్, అనంతమడుగు

సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు

దొరవారిసత్రం: మండలంలోని 8 గ్రామ సచివాలయాల్లో ఆధార్ కేంద్రాలు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీవో గోవర్ధన తెలిపారు. ప్రజలు ఈ కేంద్రాల్లో ఆరేళ్లలోపు పిల్లల ఎన్‌రోల్‌మెంట్ చేసుకోవచ్చని తెలిపారు. అలాగే 5 నుంచి 15 ఏళ్లలోపు వారికి ఆధార్ కార్డు జారీ చేస్తామని, ఆధార్ కార్డులో చిరునామా, ఫొటో, ఫోన్ నంబరు మార్పు లేదా లింక్ చేస్తామని వెల్లడించారు. వేలి ముద్రలను అప్‌డేడ్ చేసుకోవచ్చని సూచించారు. 2016 నుంచి ఆధార్ అప్‌డేట్ చేసుకోని వారు అధికారులు ఇచ్చిన సర్టిఫికెట్లతో అప్‌డేట్ చేసుకోవచ్చన్నారు. ఈ కేంద్రాలు మంగళవారం నుంచి పనిచేస్తాయన్నారు. 18వ తేదీన కల్లూరు గ్రామ సచివాలయం, 19న పూలతోట, 20న పోలిరెడ్డిపాళెం, 21న తల్లంపాడు, 24, 25న డీవీ సత్రం ఎంపీడీవో కార్యాలయం, 26న తనియాలి, 27న నెలబల్లి, 28న మీజూరు గ్రామ సచివాలయాల్లో ఆధార్ సేవలు అందుబాటులో ఉంటాయని వివరించారు.

మార్కెటింగ్‌పై అవగాహన సదస్సు

కోట: విద్యానగర్ ఎన్‌బీకేఆర్ సైన్స్ అండ్ ఆర్ట్స్ కళాశాలలో సోమవారం ఎన్‌ఐఎస్‌ఎం(నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సెక్యూరిటీస్ మార్కెట్స్) ఆధ్వర్యంలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎన్‌ఐఎస్‌ఎం రిసోర్స్‌పర్సన్ నరేంద్ర మాట్లాడుతూ స్టాక్ ఎక్స్ఛేంజ్, ఇన్వెస్ట్‌మెంట్స్, మార్కెటింగ్ అవకాశాలపై వివరించారు. దేశం ప్రగతి పథంలో నడుస్తున్న క్రమంలో మార్కెటింగ్ రంగంలో విద్యార్థులకు అపార ఉపాధి అవకాశాలు లభిస్తున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చంద్రశేఖర రెడ్డి, కోఆర్డినేటర్ రాజేష్ పాల్గొన్నారు.

కండలేరులో 53.062 టీఎంసీల నీరు

రాపూరు: కండలేరు జలాశయంలో సోమవారం నాటికి 53.062 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ విజయకుమార్‌రెడ్డి తెలిపారు. కండలేరు నుంచి సత్యసాయి గంగ కాలువకు 720, లోలెవల్ కాలువకు 150, హైలెవల్ కాలువకు 190, మొదటి బ్రాంచ్ కాలువకు 70 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు తెలిపారు.

అధైర్య పడొద్దు.. అండగా ఉంటాం


నాయకులతో మాట్లాడుతున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి

వాకాడు: కార్యకర్తలు, నాయకులు అధైర్య పడొద్దని, అండగా ఉంటామని, త్వరలోనే మంచి రోజులు రానున్నాయని వైఎస్సార్ సీపీ వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. ఆయన సోమవారం వాకాడులోని తన నివాసంలో కార్యకర్తలు, నాయకులతో సమావేశమయ్యారు. ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో దుర్మార్గపు పాలన సాగుతోందన్నారు. అధికారులు కూటమి నేతలకు తొత్తులుగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ప్రజలు అన్నింటినీ గమనిస్తున్నారని, చరమగీతం పాడతారని తెలిపారు. 2027లో జెమిలి ఎన్నికలు రానున్నాయని, వైఎస్సార్ సీపీ ప్రభంజనం సృష్టించనుందని తెలిపారు. వాకాడు దళితవాడకు చెందిన ఎంబేటి వెంకటేశ్వర్లు కోడలు ఎంబేటి సుష్మ ఇటీవల మృతి చెందడంతో రామ్‌కుమార్‌రెడ్డి ఆ కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు. అలాగే అనారోగ్యంతో బాధపడుతున్న వైఎస్సార్‌సీపీ నాయకుడు గూడూరు సుధాకర్‌రెడ్డిని పరామర్శించారు. నాయకులు కొడవలూరు దామోదర్‌రెడ్డి, దేవారెడ్డి నాగూర్‌రెడ్డి, శేషురెడ్డి, గూడూరు వెంకటేశ్వర్లురెడ్డి, పెంచలరెడ్డి, భాస్కర్‌రెడ్డి, రాజశేఖర్‌రెడ్డి, శ్రీహరిరెడ్డి, జనార్ధన్‌రెడ్డి, సుధాకర్‌నాయుడు, బాలకృష్ణయ్య, మధురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి రైతూ ఈక్రాప్ నమోదు చేసుకోవాలి

కలువాయి: ప్రతి రైతూ తప్పనిసరిగా ఈ క్రాప్ నమోదు చేసుకోవాలని ఏవో ప్రతాప్ తెలిపారు. ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. పంట నమోదుతోనే ప్రభుత్వ రాయితీలు, పరిహారం అందుతాయని వెల్లడించారు. త్వరలో మండలంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభిస్తామని తెలిపారు. తెలుగురాయపురం, వెరుబొట్లపల్లిలో ఏ గ్రేడ్, బద్దెవోలు, మాదన్నగారిపల్లి, కుల్లూరు, కలువాయి గ్రామాల్లో బీ గ్రేడ్ కొనుగోలు కేంద్రాల ఏర్పాటుకు అధికారులకు సిఫారసు చేశామని పేర్కొన్నారు. రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉందన్నారు. ఏ గ్రేడ్ రకం వరి క్వింటాలుకు రూ.2,320, పుట్టి అయితే రూ.19,720, సాధారణ రకాలైతే క్వింటాలు రూ.2,300లు, పుట్టి అయితే 19,550లకు కొనుగోలు చేస్తామని వివరించారు.

తూతూమంత్రంగా ప్రజా సమస్యల పరిష్కార వేదిక


దొరవారిసత్రం: అర్జీని పరిశీలిస్తున్న తహసీల్దార్ శైలకుమారి


చిల్లకూరులో కనిపించని ఫిర్యాదుదారులు

దొరవారిసత్రం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను తూతూమంత్రంగా నిర్వహించారు. అధికారులు రిజిస్టర్‌లో సంతకాలు పెట్టిపోయారు. తహసీల్దార్ శైలకుమారి, ఎంపీడీవో గోవర్ధన, హౌసింగ్ ఏఈ మోహన్‌రావు, ఇరిగేషన్ జేఈలు హరికృష్ణ, మెహతాజ్ ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు.

చిల్లకూరులో..

చిల్లకూరు: స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం ఎంపీడీవో గోపి నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక బోసిపోయింది. ఒక్క అర్జీదారుడు కూడా రాలేదు. గతంలో అర్జీలు ఇవ్వడం తప్ప పరిష్కారం చూపకపోవడంతోనే ప్రజలు రావడం లేదని సమాచారం. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉంది.

విద్యానగర్‌లో నగర సంకీర్తనం


నగర సంకీర్తనం చేస్తున్న సాయి భక్తులు

కోట: విద్యానగర్‌లో సోమవారం షిరిడీ సాయిబాబా భక్తులు నగర సంకీర్తన కార్యక్రమం నిర్వహించారు. వాకాడులోని షిరిడీ సాయిబాబా మందిరంలో జూన్‌లో మూడు రోజులు సాయిభక్త సమ్మేళనం నిర్వహించనున్నట్టు స్థానిక సాయిబాబా మందిరం భక్తబృందం సభ్యులు తెలిపారు. ఇందులో భాగంగా ప్రచార కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు. కార్యక్రమంలో సూర్యనారాయణ, రమణారెడ్డి, వేళాంగిణి తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన బ్రహ్మోత్సవాలు


లక్ష తులసి పూజ చేస్తున్న భక్తులు

చిల్లకూరు: గూడూరు పట్టణం బాలాజీ నగర్‌లో వున్న ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ముగిశాయి. ఆలయ 16వ వార్షికోత్సవం సందర్భంగా ప్రతి రోజూ స్వామి వారికి ప్రత్యేక పూజలు చేశారు. వివిధ వాహనాల్లో స్వామిని ఊరేగించారు. చివరి రోజు సోమవారం స్వామి, అమ్మవార్లకు విశేష అలంకరణ చేసి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం హోమం చేశారు. మహిళలు లక్ష తులసి పూజ చేశారు. ఈ కార్యక్రమాలకు ఉభయకర్తలుగా ముప్పాళ్ల మురళీమోహన్‌రాజు, వాసుదేవరాజు కుటుంబ సభ్యులు వ్యవహరించారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త పాణకా శివకుమార్ రెడ్డి, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ మాజీ చైర్ పర్సన్ దేవసేనమ్మ మధ్యాహ్నం భక్తులకు పెద్ద ఎత్తున అన్నదానం చేశారు.

ప్రభుత్వ భూమి స్వాధీనం


రెవెన్యూ అధికారులు ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

దొరవారిసత్రం: మండలంలోని కృష్ణాపురం ఎస్టీ కాలనీ సమీపంలోని అక్కరపాక చెరువు పోరంబోకు భూమి ఆక్రమణను రెవెన్యూ అధికారులు అడ్డుకున్నారు. భూ ఆక్రమణలపై గత నెలలో సాక్షి దిన ప్రతికలో 'ఆక్రమణల వివాదం' అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై తహసీల్దార్ శైలకుమారి క్షేత్ర స్థాయిలో విచారణ జరిపారు. శ్రీహరికోట నిర్వసితుల పేరుతో ఆక్రమణ జరుగుతున్న భూమి చెరువు పోరంబోకుగా గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకుని హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అనుమతి లేకుండా ఎలాంటి నిర్మాణాలు చేపట్టకూడదని పేర్కొన్నారు.

సాక్షి ఎఫెక్ట్..

ఎస్టీ కాలనీకి ప్రతి రోజూ పథకం నీరు

దొరవారిసత్రం: నేలపట్టు పంచాయతీ కొర్లగుంట ఎస్టీ కాలనీలో ప్రతి రోజూ పథకం నీరు అందించేందుకు చర్యలు తీసుకుంటున్నట్టు వైస్ ఎంపీపీ దువ్వూరు గోపాల్‌రెడ్డి, సర్పంచ్ రామయ్య తెలిపారు. సాక్షి దినపత్రికలో మూడు రోజుల క్రితం 'నీటి కోసం కోటి కష్టాలు' అన్న శీర్షికన కథనం ప్రచురితమైంది. దీనిపై వైస్ ఎంపీపీ గోపాల్‌రెడ్డి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఉమామహేశ్వరి స్పందించారు. కొర్లగుంట ఎస్టీ కాలనీని సోమవారం సందర్శించి తాగునీటి సమస్యను పరిశీలించారు. స్థానికంగా నీటి సరఫరా చేసేందుకు ఎవరూ లేకపోవడం వల్లే సమస్య ఏర్పడినట్లు గుర్తించారు. అనుదినం పథకం మోటార్ ఆన్ చేసేందుకు వ్యక్తిని నియమించినట్లు వైస్ ఎంపీపీ తెలిపారు.

పరిహారం చెల్లించి పనులు చేసుకోండి


సబ్ కలెక్టర్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న గూడలి వాసులు

చిల్లకూరు: క్రిస్ సిటీ కోసం చిల్లకూరు, కోట మండల తీర ప్రాంతాల్లో సేకరించిన భూములకు పరిహారం చెల్లించిన తర్వాతే పనులు చేపట్టాలని కొత్త పట్నంకు చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు ఉప్పల ప్రసాద్‌గౌడ్, వెంకటాద్రి డిమాండ్ చేశారు. వారు సోమవారం బాధిత రైతులతో కలిసి గూడూరు సబ్ కలెక్టర్ రాఘవేంద్ర మీనన్‌కు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ క్రిస్ సిటీ కోసం సేకరించిన భూములకు ఇప్పటి వరకు పరిహారం చెల్లించలేదన్నారు. పనులు చేపట్టేందుకు సిద్ధమయ్యారని తెలిపారు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారని వివరించారు. వారికి న్యాయం చేయాలని కోరారు. స్పందించిన సబ్ కలెక్టర్ మాట్లాడుతూ త్వరలోనే పరిహారం చెల్లిస్తామని, ఎవరూ ఆందోళన చెందవద్దని తెలిపారు.

ఇసుక తరలింపుపై ఫిర్యాదు

కోట మండలం గూడలి సమీపంలోని స్వర్ణముఖి నది పరివాహక ప్రాంతంలో కొంతమంది అధికార పార్టీ నేతలు ఇష్టానుసారంగా ఇసుక తరలిస్తున్నారని స్థానికులు ఆరోపించారు. వారు సీపీఐ నాయకులతో కలిసి ఆందోళన చేపట్టారు. వారు మాట్లాడుతూ అధికార పార్టీ నేతలు పెద్ద పెద్ద యంత్రాలతో ఇసుకను వాహనాల్లో లోడ్ చేస్తున్నారని తెలిపారు. ఇసుక లోడింగ్ పనులు లేకపోవడంతో 30 కుటుంబాల వారు ఇబ్బందులు పడుతున్నారని వివరించారు. ప్రభుత్వం పంపిణీ చేసిన భూముల్లో గ్రావెల్‌ను తవ్వుతున్నారని ఆరోపించారు. అనంతరం అధికారులకు వినతి పత్రం అందజేశారు. దీనిపై స్పందించిన సబ్ కలెక్టర్ పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

రేపు హ్యాండ్ బాల్ జిల్లా మహిళా జట్టు ఎంపిక

చిల్లకూరు: నెల్లూరులోని డీకేడబ్ల్యూ కళాశాల క్రీడా మైదానంలో బుధవారం ఉమ్మడి నెల్లూరు జిల్లా హ్యాండ్ బాల్ మహిళా జట్టును ఎంపిక చేయనున్నట్టు హ్యాండ్ బాల్ అసోసియేషన కార్యదర్శి శ్రీరేష్ తెలిపారు. ఆయన సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. అర్హత కలిగిన వారు తమ ఆధార్ కార్డు, జనన ధ్రువీకరణ పత్రం తీసుకురావాలని సూచించారు. ఎంపికైన జట్టు కర్నూలులో ఈ నెల 21 నుంచి 23 వరకు జరిగే రాష్ట్ర స్థాయి హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొంటుందని వివరించారు. వివరాలకు 9704827095లో సంప్రదించాలని కోరారు.

కారు ఢీకొని ఒకరికి గాయాలు


వెంకయ్యను ఆస్పత్రికి తరలిస్తున్న అంబులెన్స్ సిబ్బంది

నాయుడుపేట టౌన్: మండలంలోని పండ్లూరు జాతీయ రహదారి కూడలి వద్ద సోమవారం బైక్‌ను కారు ఢీకొనడంతో ఒకరు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసుల కథనం మేరకు.. నాయుడుపేట మండలం కల్లిపేడుకు చెందిన వెంకయ్య బైక్‌లో గూడూరుకు వెళ్లి తిరిగి నాయుడుపేట వస్తున్నాడు, పండ్లూరు జాతీయ రహదారి కూడలి వద్ద రోడ్డు దాటుతుండగా నెల్లూరు వైపు నుంచి చెన్నై వెళుతున్న కారు ఢీకొంది. తీవ్రంగా గాయపడిన వెంకయ్యను స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు, అక్కడి నుంచి నెల్లూరుకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరించాలి





గూడూరు రూరల్: గూడూరు పట్టణంలో అంగన్‌వాడీల నిరసన, కోటలో ఆందోళన చేస్తున్న అంగన్‌వాడీ సిబ్బంది



రాపూరులో ..


నాయుడుపేట టౌన్‌లో..

కోట: న్యాయమైన సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోట, వాకాడు, చిట్టమూరు మండలాల అంగన్‌వాడీ సిబ్బంది డిమాండ్ చేశారు. వారు సోమవారం ఐసీడీఎస్ కోట ప్రాజెక్ట్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు పద్మలీల మాట్లాడుతూ అంగన్‌వాడీలకు వేతనాలు పెంచాలన్నారు. గ్రాట్యూటీ అమలు చేయాలని, మినీ అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న అద్దెలు, టీఏ బిల్లులు వెంటనే ఇవ్వాలన్నారు. 164 సూపర్‌వైజర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. మెనూ చార్జీలు పెంచాలని, ఉచితంగా గ్యాస్ సరఫరా చేయాలని, వేతనంతో కూడిన మెడికల్ లీవ్‌లు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు. సమస్యలు పరిష్కరించకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. వారికి సీఐటీయూ నాయకులు మద్దతు తెలిపారు. అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ ప్రాజెక్ట్ అధ్యక్షురాలు విజయ, సుగుణ, సరోజ పాల్గొన్నారు.

కనీస వేతనం చెల్లించాలి

రాపూరు: కనీస వేతనం రూ.26 వేలు చెల్లించడంతోపాటు ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. వారు సోమవారం రాపూరులో ఆందోళన చేపట్టారు. సీఐటీయూ జిల్లా కార్యదర్శి సురేష్, అంగన్‌వాడీ యూనియన్ నాయకురాలు ప్రమీల మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలన్నారు. కార్యక్రమంలో జయసుధ, లక్ష్మి, సుభాషిణి పాల్గొన్నారు.

అంగన్‌వాడీల నిరసన

గూడూరు రూరల్: సమస్యలు పరిష్కరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు కోరారు. వారు సోమవారం సీఐటీయూ నాయకులతో కలిసి ఐసీడీఎస్ సీడీపీవో కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. అనంతరం సబ్ కలెక్టర్ రాఘవేంద్రమీనన్‌కు వినతి పత్రం అందజేశారు. నాయకులు మాట్లాడుతూ కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చాలని కోరారు. మినీ సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చాలని, సర్వీస్‌లో ఉండి మృతిచెందిన కార్యకర్తల దహన సంస్కారాలకు రూ.20 వేలు చెల్లించాలని కోరారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ అసోసియేషన్ అధ్యక్షురాలు ఇందిరమ్మ, కార్యదర్శి ప్రభావతి, సెక్టార్ లీడర్లు మంగమ్మ, ఆసియా బేగం, మణికుమారి, విజయలక్ష్మి, ప్రసన్న, భారతమ్మ పాల్గొన్నారు.

నాయుడుపేటలో..

నాయుడుపేట టౌన్: సమస్యల పరిష్కారం కోసం నాయుడుపేట, పెళ్లకూరు, ఓజిలి మండలాల ప్రాజెక్టు కార్యదర్శి ఎన్ శ్యామలమ్మ ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, హెల్పర్లు నాయుడుపేటలోని ఐసీడీఎస్ సీడీపీవో కార్యాలయం వద్ద ధర్నా చేశారు. సీఐటీయూ నాయకులు ముకుంద, మునిరాజ, అంగన్‌వాడీ కార్యకర్తల సంఘ నాయకులు కళావతి, పుష్పలత, దుర్గమ్మ పాల్గొన్నారు.

అంగన్‌వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలి

వెంకటగిరి రూరల్: అంగన్‌వాడీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ అధ్యక్ష, కార్యదర్శులు స్వరూపరాణి, వరలక్ష్మి డిమాండ్ చేశారు. అంగన్‌వాడీ కార్యకర్తలు సోమవారం వెంకటగిరిలోని ఐసీడీఎస్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. కార్యక్రమంలో అనురాధ, అన్నపూర్ణ, మమ్ములబేగం తదితరులు పాల్గొన్నారు.